క్లుప్తంగా

పాఠశాల తనిఖీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని కొర గుంటపాలెం ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ-2 కే నరేష్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం మెనూ సక్రమంగా అమలు చేసేలా పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

వరిపైరును కాపాడుకోండి

ముదినేపల్లి రూరల్: భారీవర్షాల వల్ల వరిపైరు దెబ్బతినకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ రైతులకు సూచించారు. మండలంలోని అనేక గ్రామాల్లో విత్తనాలు నేరుగా వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేపట్టారు. ముంపు బారిన పడ్డ పొలాల్లో నీటిని ముందుగా బయటకు తోడివేయాలన్నారు. తరువాత ఎకరానికి 15 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువులను చల్లుకోవాలన్నారు. జింక్ లోపం వచ్చే ప్రమాదమున్నందున లీటరు నీటికి 2 గ్రాముల వంతున ముడి జింకు పూర్తిగా నీటిలో కరిగేవిధంగా ఎకరాకు 200 లీటర్ల వంతున పిచికారీ చేసుకోవాలని సూచించారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ



ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను సోమవారం అందజేశారు. మండల కేంద్రానికి చేరుకున్న ఈ పాఠ్యపుస్తకాలను ఇటీవల పాఠశాలల వారీగా ఉపాధ్యాయులకు అందజేశారు. వీటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అందజేశారు. వాడవల్లి, కోమర్రు, నరసన్నపాలెం, పెయ్యేరు, పాఠశాలల్లో వీటిని అందజేశారు.

భూసేకరణ చేయాలని వినతి

పమిడిముక్కల: గత 40 సంవత్సరాలుగా శ్మశానభూమి లేక పైడికొండలపాలెం ఎస్సీ ఏరి యా వాసులు ఇబ్బందులు పడుతున్నారని సా మాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ సోమ వారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ ఏరియాకు చెందిన 175 కుటుంబాలు శ్మశానభూమి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శ్మశానవాటిక నిమిత్తం భూమి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఏకాగ్రత అవసరం

మండవల్లి: ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు విద్యపైనే దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం నాగార్జునరావు అన్నారు. మండవల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మోటివేషన్, ప్రథమ చికిత్సపై ప్రిన్సిపాల్ గుడివాడ సుధాకర్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐక్య వేదిక రాష్ట్ర బాధ్యులు నాగార్జునరావు, కవుతరపు ప్రసాద్, పి.సత్యనారాయణ, ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు, కె.మార్కురాజు, ప్రిన్సిపాల్ సుధాకర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

గుడివాడరూరల్: విద్యార్థులకు ఉపాధ్యాయు లు నాణ్యమైన విద్యను అందించేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో అనగాని వెంకటరమణ పేర్కొన్నారు. స్థానికమండల పరిషత్ కార్యాలయంలో సోమ వారం గుడివాడ మండలంలోని, అర్బన్‌లోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యా దీవెన కిట్లు, ఇతర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో-1 ఐ.విజయ్, ఎంఈవో-2 బాలాజీ, హెచ్ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ విజయలక్ష్మి మృతి



పెదపారుపూడి: మండల మాజీ ఎంపీపీ కాజ విజయలక్ష్మి (70) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. విజయవాడ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 2014-19 మధ్య కాలంలో మండల పరిషత్ అధ్యక్షురాలిగా పని చేశారు. టీడీపీ మహిళ మండల అధ్యక్షురాలిగా పనిచేశారు. విజయలక్ష్మికి కుమారుడు ఉన్నాడు. మాజీ ఎంపీపీ మృతిపై పలువురు నాయకులు పార్టీలకు అతీతంగా సంతాపం తెలియజేశారు.

146 మందికి వైద్య పరీక్షలు

మండవల్లి: మెడికేర్ ఆస్పత్రి (కైకలూరు) ఆధ్వర్యంలో మండవల్లిలోని శ్రీనాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు హరీష్‌కుమార్, హేమంత్‌కుమార్, 146 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ మెండా ఝాన్సి, మెండా సురేష్, తోట శ్రీనివాసరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

వదలని వర్షంతో జలమయం

గుడివాడరూరల్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో పల్లపు ప్రాంతాలు, రహదారులు నీట మునిగాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు కురిసిన వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని నెహ్రూచౌక్, ఏలూరురోడ్, బస్టాండ్ సెంటర్, బంటుమిల్లిరోడ్, ముబారక్ సెంటర్, ధనియాలపేట, బేతవోలు, కార్మికనగర్, నైజంపేట, శ్రీకాళహస్తీ కాలనీ తదితర ప్రాంతాల్లో వర్షంతో రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం వల్ల జనజీవనం స్తంభించింది. పట్టణంలోని నైజంపేటలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వర్షపు నీరు ఇంట్లోకి చేరడంతో నీటిని బయటకు తోడేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇంట్లోని సామాన్లు నీటిలో తేలాయి. పలు ప్రాంతాల్లో కూడా వర్షపు నీరు ఇళ్ల పరిసరాలకు చేరి చెరువులుగా మారాయి.

గుడివాడ మండలంలో..

మండల పరిధిలోని దొండపాడు, మోటూరు, లింగవరం, వలివర్తిపాడు, బొమ్ములూరు, తటివర్రు, రామనపూడి, చిరిచింతల, చౌటపల్లి తదితర గ్రామాల్లో వర్షంతో రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు నీట మునిగి చెరువులుగా మారాయి. వర్షం తగ్గిన వెంటనే సోమవారం సాయంత్రం ఆయా గ్రామాల్లోని పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య సిబ్బందిచే వర్షపు నీరు డ్రైనేజీల ద్వారా బయటకు పోయేందుకు చర్యలు చేపట్టారు.

వరి నాట్లకు నష్టం లేదు..

వర్షం వల్ల ప్రస్తుతానికి వరినాట్లకు ఇబ్బంది లేదని, ఇలాగే మరో 3రోజులు కొనసాగితే నష్టం వాటిల్లే అవకాశం ఉందని మండల వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షం తగ్గుముఖం పడితే మండలంలో వరినాట్లు ఊపందుకునే అవకాశం ఉందని ఆయా గ్రామాల్లోని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మునిగిన వరి నాట్లు

పామర్రు: ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు కురుస్తున్న ఏకధాటి వర్షాలకు మండలంలో వరినాట్లు వేసిన పొలాలు నీటి మునిగాయి. మండల పరిధిలో 23,500 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. వీటిలో ఇప్పటికి సుమారు 8 వేల ఎకరాల్లో నాట్లు వేశారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి నాట్లు వేసిన వరి పొలాలు నీటిలో మునిగిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువల్లో నీటి మట్టం తగ్గించాలని కోరుతున్నారు. గ్రామంలోని పుల్లేరు, లంకకాలువ, దేవుడు కాలువ నీటి మట్టాలను తగ్గించాలని ఆయా ప్రాంతాల రైతులు కోరుకుంటున్నారు.

కైకలూరు: ఉపరితల ఆవర్తనం, రుతుపవన ద్రోణుల ప్రభావం కారణంగా కురుస్తున్న వర్షాలకు కైకలూరు పరిసర లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సోమవారం భారీ వర్షం కురవడంతో కైకలూరు టౌన్ హాలు, వెలంపేట, బస్టాండ్, రైల్వేస్టేషన్ రోడ్లలో నీరు నిలిచింది. ప్రధాన రహదారులపై నీరు చేరడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ సిబ్బంది డ్రెయిన్లకు మరమ్మతులు చేస్తున్నారు.



బస్టాండ్ సెంటర్‌లో రహదారి జలమయం



నైజాపేట పాత మిల్లు వద్ద ఇంట్లోకి చేరిన వర్షపు నీరు



పామర్రులో వాన నీటిలో పొలాలు

నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

నిభానుపూడి(పామర్రు): బాలిక మృతి కేసులో నిందితులు ఎంతటి వారైనాసరే వారికి కఠిన శిక్షలు పడే విధంగా చూస్తామని పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని నిభానుపూడి గ్రామంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఎస్సీ బాలిక మృత దేహాన్ని ఎమ్మెల్యే సోమవారం సందర్శించారు. పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈరోజు ఎంతో బాధకరమైన రోజని అన్నారు. 9వ తరగతి చదివే విద్యార్థి కనబడటం లేదని తల్లి ఫిర్యాదుచేస్తే పోలీసులు గత నాలుగు రోజులుగా బృందాలుగా ఏర్పడి పరిశీలనలు చేశారన్నారు. ఈ నేపథ్యంలో మొవ్వ మండలం మంత్రిపాలెం గ్రామంలో బాలిక మృతదేహాన్ని కాలువలో గుర్తించారని తెలిపారు. ఈ సంఘటనకు కారకులను శిక్షించేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి బాలిక మృతికి కారకులైన నిందితులపై కఠిన చర్యలు త్వరలో తీసుకోవాలని, బాధిత కుటుంబానికి సహాయం చేసి ఆదుకోవాలని కోరతామని తెలిపారు. జిల్లా కలెక్టర్‌ని కలిసి ప్రభుత్వం నుంచి పరిహారంగా రూ.8 లక్షలను త్వరలో అందజేస్తామన్నారు. ఇటువంటి దుర్ఘటన నియోజకవర్గంలో జరగటం చాలా బాధ కలిగిస్తోందన్నారు. నియోజకవర్గంలో ఎవరైనా ఒంటరిగా ఉన్న పిల్లలు ఆదరణలేని వారు, వారి సమాచారాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలియజేసి రక్షణ పొందాలని అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసు వారిని ప్రజలను ఎమ్మెల్యే కోరారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ పి.రత్నకుమారి, తదితర పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు, స్థానిక ప్రజలు మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

నవయుగ కవి చక్రవర్తి జాషువాకు నివాళి

పామర్రు: స్థానిక శివరామ సినీకాంప్లెక్సులో గుర్రం జాషువా వర్ధంతి సోమవారం నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది ఆవుల ప్రవీణ్ మాట్లాడుతూ తెలుగు ప్రజల మనస్సులో నిలిచి పోయిన కవి, సంఘ సంస్కర్త, దోపిడి వర్గాలపై తిరుగుబాటు చేసిన వ్యక్తి జాషువా అన్నారు. చీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలను పొందారని తెలపారు. కళా ప్రపూర్ణ, నవయుగ చక్రవర్తి అనే బిరుదులు పొందారని కొనియాడారు. ఆయన మరణించినా ఆయన రచనలు ప్రజల మనస్సులో చిర స్థాయిగా నిలిచిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన హక్కుల పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల, నాయకులు జువ్వనపూడి సురేంద్ర, నత్తా అనిల్, కొల్లూరి సంజయ్, ప్రసాద్ పాల్గొన్నారు.



పామర్రులో జాషువా చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వలంటీర్ల సేవలు అమూల్యం

ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: గ్రామ సచివాలయాల వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు అమూల్యమని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని వడాలి సచివాలయం వద్ద జగనన్న సురక్ష క్యాంపు సోమవారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌరవ వేతనం, సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్లపై కొందరు రాజకీయ అజ్ఞానులు పనిగట్టుకుని విమర్శలు చేయడం సహించరానిదన్నారు. ఇలాంటి దుర్మార్గపు విమర్శలను ప్రతి ఒక్కరూ ఖండించి వలంటీర్లకు అండగా నిలవాలని కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం కావడానికి వలంటీర్లే ప్రధాన కారకులని అభివర్ణించారు. ఈ సభలో 650 పైగా 11 రకాల సర్టిఫికెట్లను అందజేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, గంటా సంధ్య, సర్పంచ్‌లు మరీదు దుర్గశ్రీ, సైదాల శ్రీనివాసరావు, శీలం రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు పల్లి శ్రీదేవి, మరీదు నాగయ్య, మోట్రు ఏసుబాబు, నాయకులు మర్రివాడ వీరారెడ్డి, బొర్రా శేషుబాబు, సాయిబాబు, గంటా కోటేశ్వరరావు, శ్రీధర్, కుమార్, మరీదు హనుమంతు, ఎంపీడీవో మల్లీశ్వరీ పాల్గొన్నారు.

కైకలూరు: జగనన్న సురక్ష కార్యక్రమం కైకలూరు మండలం ఆటపాక, కలిదిండి మండలం గుర్వాయిపాలెం గ్రామాల్లో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డీఎన్నార్ పాల్గొన్నారు. సచివాలయాల వద్ద మొక్కలను నాటారు. ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు తలారి మణిమ్మ, సర్పంచ్ బత్తిన ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవి, ఎంపీటీసీ సభ్యులు తమ్మిశెట్టి లక్ష్మి, పట్టపు బాలమ్మ, గోదావరి సత్యనారాయణ, ఉపసర్పంచ్ బావిశెట్టి నాగేశ్వరరావు, తలారి జాన్, రఫాయేల్, సింగంశెట్టి బుజ్జి, తహసీల్దారు బి.మురళీకృష్ణ, వంశీ, ఎంపీడీవో జి.రాంబాబు, సచివాలలయ సిబ్బంది, వలంటీర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కలిదిండి మండలం గుర్వాయిపాలెంలో రూ.20 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.12.50 లక్షల ఇతర నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రారంభించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వడాలిలో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవం



చిన్నారులు, తల్లులను సత్కరించిన స్టేడియం వాకర్స్‌క్లబ్ సభ్యులు

గుడివాడరూరల్: తల్లిదండ్రులను చిన్నతనం నుంచే గౌరవించడం మన సంప్రదాయమని పలువురు ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. స్థానిక శారదా వికాస్ స్కూల్‌లో సోమవారం తల్లిదండ్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత చిన్నారులచే తల్లులను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా వాకర్స్‌క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించి పూజించాలని కోరారు. క్లబ్ ఫౌండర్ అధ్యక్షుడు లోయీశ్వర వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు ఆర్జా ప్రసాద్, మెరుగుమాల శివరామకృష్ణ, ట్రస్ట్ చైర్మన్ లింగం చిట్టిబాబు, సభ్యులు రూప్‌చంద్ జైన్, జ్ఞాన్ చంద్‌జైన్, జుజ్జువరపు వెంకటేశ్వరరావు, కొమరోలు రామకృష్ణ, పొన్నూరు సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యంకి జీవితం ఆదర్శనీయం



వెంకట రమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అయ్యంకి మురళీకృష్ణ, గ్రామస్తులు



జమీగొల్వేపల్లిలో అయ్యంకి చిత్ర పటానికి నివాళులర్పించిన ఉషాదేవి, విద్యార్థులు

అయ్యంకి (మొవ్వ): గ్రంథాలయాల మనుగడకై అయ్యంకి వెంకట రమణ చేసిన ఉద్యమ ఫలితంగా నేడు వేలాది మంది గ్రంథాలయాలను వినియోగించుకుంటున్నారని, ఇంతటి మహాను భావుడు తమ గ్రామంలో పుట్టటం గర్వకారణం అని మొవ్వ జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి పేర్కొన్నారు. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య జయంతి వేడుకలను ఆయన స్వగ్రామం అయ్యంకి పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట రమణయ్య చిత్రపటానికి జెడ్పీటీసీ పార్వతి, గ్రామ సర్పంచి నాగనబోయిన సునీల్, రమణయ్య మనువడు అయ్యంకి మురళీకృష్ణతో కలిసి పూల మాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మురళీకృష్ణ గ్రామంలో వలంటీర్ల వినియోగార్థం 20 బయోమెట్రిక్ మిషన్లు, ప్రధాన రహదారిపై నాలుగు సీసీ కెమేరాల ఏర్పాటుకు నగదుని అందజేశారు. జెడ్పీటీసీ, సర్పంచి, ఉప సర్పంచి రాజులపాటి సుబ్బారావు, గ్రేడ్-1 ఈవో వక్కలగడ్డ నరసింహారావు, సచ్చివాలయ సిబ్బంది, వలంటీర్లు అయ్యంకి మురళీకృష్ణను ఘనంగా సత్కరించారు.

జమీగొల్వేపల్లి(పామర్రు): గ్రంథాలయ వ్యవస్థకు ఆధ్యుడు అయ్యంకి వెంకట రమణయ్య అని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి అన్నారు. మండల పరిధిలోని జమీగొల్వేపల్లి గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో వెంకట రమణయ్య జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయాలు వాటి ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ పతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.రామయ్య, గ్రంథాలయ అధికారి వీ నాగసురేష్, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలనకు సహకరించాలి

ఆర్డీవో పద్మావతి

గుడివాడరూరల్: పట్టణంలో ఓటర్ల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీనికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం సాయంత్రం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు గడప గడపకు వెళ్లి తమ సిబ్బంది ఓట్లు తొలగింపు, మార్పులు, చేర్పులు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. బీఎల్‌వోలకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఓట్ల వెరిఫికేషన్ ఆగస్టు 21వ తేదీ వరకు జరుగుతుందని, తదనంతరం రాజకీయ పార్టీలు తమ ఓట్లను తొలగించారని, తప్పులు జరిగాయని ఆరోపించడం కన్నా ఇప్పుడే వార్డుల్లో బీఎల్‌వోలతో కలసి వెరిఫికేషన్ చేసుకుని అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. వీఆర్వోలకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని, ప్రజలు కూడా ఇంటింటికి వచ్చే బీఎల్‌వోలకు, వీఆర్వోలకు సహకరించాలని సూచించాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు, కొంకితల ఆంజనేయప్రసాద్, బీజేపీ, టీడీపీ, జనసేన, సీపీఎం, సీపీఐ తదితర రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో పద్మావతి

మణిపూర్ దాడులపై కేంద్రం చర్యలు తీసుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో పార్టీల నాయకులు

గుడివాడరూరల్: మణిపూర్‌లో అల్లర్లను అరికట్టి శాంతిభద్రతలు నెలకొనేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలు పార్టీలు నేతలు విజ్ఞప్తి చేశారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లపై దళిత నాయకుడు పొంగులేటి జయరాజు ఆధ్వర్యంలో సోమవారం పలు రాజకీయ పార్టీల నాయకులు, దళిత సంఘాలు, పాస్టర్లతో కలసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రపంచ దేశాల ముందు తల దించుకునే విధంగా మణిపూర్‌లో సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈనెల 27వ తేదీన పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్సీపీ రెడ్డి, టీడీపీ నాయకుడు గుత్తా చంటి, పలు దళిత సంఘాల నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

గుడివాడరూరల్: మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక సంఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని ఇండియన్ దళిత జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్డీవో పి.పద్మావతికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు దారం ఉపేంద్ర మాట్లాడుతూ మణిపూర్‌లో క్రిస్టియన్ మైనార్టీ వర్గాలకు చెందిన కుకీ తెగల వారిపై ప్రత్యర్థులు చేస్తున్న మారణకాండపై కేంద్రం, మణిపూర్ ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. సీనియర్ జర్నలిస్ట్ వల్లభాపురం బుజ్జిబాబు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పార్టీల నాయకులు, దళిత నేతలు

హుండీ కానుకల లెక్కింపు

గుడ్లవల్లేరు(గుడివాడరూరల్): గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో శ్రీకొండాలమ్మ అమ్మవారి ఆలయ హుండీల ఆదా యాన్ని దేవదాయ ధర్మదాయశాఖ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించారు. 63రోజులకు నోట్ల రూపంలో రూ.30,03,925లు, చిల్లర రూపేణ రూ.1,56,118 మొత్తం రూ.31,60,043 వచ్చాయి. 79 గ్రాముల బంగారం, 3.050 గ్రాముల వెండిని భక్తులు అమ్మవారికి కానుకలుగా సమర్పించారు. పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయ ఈవో కేవీ గోపాలరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం వీర వెంకట కృష్ణమూర్తి, ఆలయ ఈవో కానూరి సురేష్‌బాబు, ఆలయ పాలకవర్గ సభ్యులు పామర్తి వెంకటస్వామి, కొమ్మన బోయిన రవిశంకర్, వల్లూరు వెంకటరావు, బాడిగ లీలసౌజన్య, నారేపాలెం వెంకటనిర్మల, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గుడివాడరూరల్:పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆలయం హుండీ కానుకల లెక్కింపు దేవదాయ, ధర్మాదాయశాఖ అధికారుల సమక్షంలో సోమవారం భక్తులు, ఆలయ సిబ్బంది లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ తనిఖీ అధికారి వీవీడీ ప్రసాద్ మాట్లాడుతూ రూ.6,68,434 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, పాలక మండల సభ్యులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రపుడెక్కను వెంటనే తొలగించండి

గుడ్లవల్లేరు(గుడివాడరూరల్): గుడ్లవల్లేరు మండలంలోని వడ్లమన్నాడు మురుగు కాల్వలో మేట వేసిన గుర్రపుడెక్కను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని డ్రైనేజీ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. వడ్లమన్నాడు మురుగు కాల్వను డ్రైనేజీ అధికారులు, రైతులతో కలసి సోమవారం పరిశీలించారు. గుర్రపు డెక్క తొలగిస్తే కాల్వ ప్రవాహానికి అడ్డు లేకుండా దిగువ ప్రాంతాలకు నీరు చేరుకుంటుందని వివరించారు. అనంతరం వడ్లమన్నాడు డ్రెయిన్, ముక్కోలు, వడ్లమన్నాడు, గూడూరు, కొంకెపూడి వద్ద డ్రైనేజీ కాల్వలను అధికారులు, రైతులతో కలసి పరిశీలించారు. అధికారులు చేపట్టాల్సిన చర్యలను వారికి వివరించారు.పెడన సెక్షన్ డ్రైనేజీ ఏఈ మురళీ, సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గౌరవం

కైకలూరు: అంకితభావంతో విధులు నిర్వహించే అధికారులు అన్ని చోట్లా గౌరవం పొందుతారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై విజయవాడ ఇంటిలిజెన్స్ డిపార్టుమెంటుకు వెళుతున్న సీఐ వైవీవీఎల్ నాయుడుకి వీడ్కోలు సభ స్థానిక సీతారామ ఫంక్షన్ హాలులో సోమవారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతిభద్రతల నిర్వహణలో వైవీవీఎల్ నాయుడు సమర్థవంతంగా పనిచేశారన్నారు. కరోనా సమయంలోనూ ఉత్తమ విధులు నిర్వహించారని అభినందించారు. పలు మండలాల ఎస్ఐలు సీఐ పనితీరును కొనియాడారు. అనంతరం సీఐను ఘనంగా సన్మానించారు. ఎంపీపీలు అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, నంబూరి శ్రీదేవి, చెరుకువాడ బలరామరాజు, పట్టణ ఎస్ఐ ఆకుల రఘు, ఎస్ఐలు షణ్ముఖసాయి, రామకృష్ణ, జ్యోతిబాస్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.